తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వైభవంగా నేత్ర ప్రదాయని
# కుంభాభిషేకం

**జనసందోహం మధ్య ఊరేగింపుగా అమ్మవారికి వస్త్రాల సమర్పణ**
**న కుంభాభిషేక వైభవం చరిత్రలో నిలిచిపోతుంది - మంత్రి రోజా**




అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి రోజా

నగరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:
నేత్ర ప్రదాయని దేశమ్మ దేవత నూతన ఆలయ అష్టరజిత మహా కుంభాభిషేక ఉత్సవాలు సోమవారం నభూతో నభవిష్యత్‌అన్న తీరున జరిగింది. అజరామరం నేత్ర ప్రధాయణి కుంభాభిషేకోత్సవం అన్న రీతిన సరికొత్త వైభవాన్ని తలపించింది. సోమవారం సాయంత్రం టీఆర్ కండ్రిగ పోతురాజు ఆలయ సమీపం నుంచి దేశమ్మ అమ్మవారికి గ్రామంలోని మహిళందరితో కలసి మంత్రి రోజా పరిపట్టం కట్టుకుని చీరల, సారెతో ఊరేగింపుగా బయలుదేరగా మంగళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, గ్రామీణ నృత్యాలు, బసవ నృత్యాలు అంటూ వరుసుగా అత్యద్భుతంగా అమ్మవారి పాటలకు ప్రదర్శనలిస్తూ కళాకారులు ముందుకు సాగగా సాంప్రదాయబద్ధంగా అమ్మవారి సారెను మంత్రితో పాటు గ్రామ మహిళలందరూ తీసుకుని ప్రధాన మార్గంతో ఊరేగింపుగా రావడం నేత్ర పర్వంగా నిలిచింది. కుంభాభిషేక ఉత్సవానికి కొత్త హంగులను జత చేసింది. వస్త్రాలతో ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ కమిటీ ఛైర్మన్ వేణుబాబు, ఈవో రామచంద్రయ్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ మహిళతో పాటు గణపతి హోమం వేదిక వద్దకు చేరుకున్న మంత్రి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా వేద పండితులు గణపతి హోమంను ప్రారంభించారు. హోమ పూజలనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామదేవత నేత్ర ప్రధాయణిగా మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోను ప్రసిద్ధి గాంచిన దేశమ్మ దేవత ఆలయాన్ని నూతనంగా నిర్మించే భాగ్యాన్ని తనకు కల్పించడం మూడు దశాబ్దాల అష్ట రజిత మహా కుంభాభిషేకంలో పాల్గొనడం చూస్తుంటే అమ్మవారు ఈ మహత్కార్యానికి తనను ఎన్నుకున్నట్లే భావిస్తున్నానని అది నా అదృష్టమన్నారు. ఆలయం నగరి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అమ్మవారి ఆశీస్సులు నగరి నియోజకవర్గం మీద, జగనన్న మీద, రాష్ట్రం మీద ఉండాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గూడూరులో టిడిపి సంబరాలు
### టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశిం సునీల్ !



గూడూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త
గూడూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశిం సునీల్ కుమార్ పేరును అధిష్టానం ఖరారు చేసిందన్న సమాచారంతో పట్టణంలోని గడియారం స్థంభం, పార్టీ కార్యాలయం వద్ద అభిమానులు భాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పార్టీకి చెందిన నాయకులు పలువురు టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించారు. కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సందడి నెలకొంది. సంబరాల్లో నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, మస్తాన్ నాయుడు, శివకుమార్, ఇశ్రాయిల్ కుమార్, వెంకటేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# తేలని పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం



పలమనేరు, ఫిబ్రవరి 5 ,ప్రభాతవార్త:
పలమనేరులో వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరన్న చర్చ తీవ్ర స్థాయిలో జరుగుతుంది. ఇప్పటి వరకు పలు నియోజకవర్గలలో అభ్యర్థుల పేర్లను వైకాపా అదిష్టానం ఖరారు చేసినప్పటికి ఇప్పటి వరకు పలమనేరు అభ్యర్థి పేరు ఖరారు చేయకపోవడంతో అటు వైకాపా నాయకులు ఇటు ప్రజలలో తీవ్ర చర్చకు తావునిస్తుంది. ఇప్పటి వరకు వైకాపా ఎమ్మెల్యే డా. వెంకటేగౌడా పేరు వినిపిస్తుంటే ప్రస్తుతం మరో కోత్త పేరు తెరపైకి వస్తుంది. ఎమ్మెలే పై పార్టీలోని కీలక నాయకులలో అసంతృప్తి ఉనట్లు అదిష్టానం దృష్టికి వెళ్ళిందని దీంతో అధిష్టానం మరో అభ్యర్థిని పలమనేరులో ఖరారు చేసే అవకాశాలు ఉనట్లు వార్తలు వినిపిస్తుడడంతో పలమనేరు నియోజకవర్గంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలలో రోజురోజుకు చర్చలు తీవ్రంగా మారుతుంది. వైకాపాలో 2019 అధిక మెజారిటీలో డా. వెంకటేగౌడా గెలుపొందడం అప్పటి నుండి ఆయన నియోకవర్గంలోని నాయకుల, కార్యకర్తలతో కలసి ప్రభుత్వ సంక్షేమాలను ప్రజలకు అందిస్తు ఆయనకంటు పలమనేరు నియోజకవర్గంలో ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఇటీవల కాలంలో మండల స్థాయి వైకాపా

### మరో కొత్త పేరు తెరపైకి

నాయకులలో ఎమ్మెల్యేపై కొంత పాటి వ్యతిరేకత ఉన్నట్లు వినికిడి. దీంతో కొంత మంది నాయకులు వారి మండలాలలో జరిగే ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు సైతం హాజరుకావడం లేదు. ఆయన కంచుకోట అయిన వి. కోటలో సైతం మండల స్థాయి నాయకులలో చీలిక, వర్గ పోరుతోపాటు ఎమ్మెల్యేపై అసంతృప్తి అధికంగా ఉనట్లు తెలుస్తోంది.

**ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు...!**

గత కొంత కాలంగా పలమనేరు అభ్యర్థిగా మరో పేరు అటు వైకాపా నాయకులలోను ఇటు ప్రజలలోను వినిపిస్తుంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పై వ్యతిరేఖత ఉండడంతో అధిష్టానం మరో వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై ఇప్పటికే అధిష్టాన మండల స్థాయి నాయకులతో సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. నియోజకవర్గంలోని వి. కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి మండలాలలో కీలక నాయకులు ఎమ్మెల్యేపై అసంతృప్తితో ఉనట్లు వారు ఎన్నికలలో ఎమ్మెల్యేకు పనిచేస్తారా లేదా అన్న అనుమానాలు అధికంగా ఉన్న క్రమంలో తదుపరి కార్యచరణపై సుదీర్ఘ చర్చలకు తావునిస్తుంది. ఏమైనప్పటికి ఎన్నికలకు అతితక్కువ సమయం ఉండడంతో అభ్యర్థుల మార్పు అన్న అంశం కొత్త చర్చకు తావునిస్తుంది. వెంకటేగౌడాను అభ్యర్థుగా ఖరారు చేస్తే అసంతృప్తిలో ఉన్న నాయకులను బుజ్జగించి సద్దుబాటు చేసుకుంటారా...లేక కొత్త అభ్యర్థిని అధిష్టానం ఖరారు చేస్తే అది ఎవరు..ఆ అభ్యర్థితో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు కలసి పని చేసి విజయానికి కృషి చేస్తారా అన్న అంశా లను వేచి చూడాల్సి ఉంది.

## ముద్దనపల్లి అటవీప్రాంతంలో చేరిన ఒంటరి ఏనుగు

రామకుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త
గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో భీభత్సం సృష్టించిన ఒంటరి ఏనుగు ముద్దనపల్లి అటవీ ప్రాంతానికి చేరింది. గుండిశెట్టిపల్లి మీదుగా ఈ ఏనుగు మండలంలో ప్రవేశించింది. కాగా ముద్దనపల్లి అటవీ పరిధిలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రి పూట ఎవరూ పొలాల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు. ట్రాకర్లు ఏనుగుల జాడను గుర్తిస్తూ దారి మళ్లించే యత్నంలో ఉన్నారు.

# వెంకటగిరి అభ్యర్థులు ఖరారు

### వైసిపికి నేదురుమల్లి, టిడిపికి కురుగొండ్ల!
### పోరుకు సమాయత్తమవుతున్న అభ్యర్థులు



వైసిపి రామ్‌కుమార్ రెడ్డి, టిడిపి కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త
వెంకటగిరి నియోజకవర్గ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. వైసిపి పార్టీ అభ్యర్థిగా నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కురుగొండ్ల రామకృష్ణ నాలుగోసారి తెలుగుదేశం పార్టీ టికెట్‌ను చేజిక్కించుకున్నారు. 2009వ సంవత్సరంలో ఆయన మొట్టమొదట టిడిపి టికెట్ తీసుకొని నియోజకవర్గంలో విజయం సాధించారు. అనంతరం 2014 సంవత్సంలో కూడా కురుగొండ్ల గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వైసిపి గాలివీచడంతో కురుగొండ్ల టిడిపి అభ్యర్థి ఓటమి పాలయ్యారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా కురుగొండ్ల రామకృష్ణ పేరును అధిష్టానం ఖరారు చేసింది. కురుగొండ్ల రామకృష్ణ పేరును అధిష్టానం ఖారారు చేసింది. కురుగొండ్ల వెంకటగిరి రాపూర్‌లలో అన్నా క్యాంటీన్లను సొంత నిధులతో నిర్వహిస్తున్నారు. భవిష్యత్తు గ్యారెంటీ బాబు ష్యూరిటీ కార్యక్రమాలు కూడా ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా నిర్వహించారు. 10 సంవత్సరాలు తాను నియోజకవర్గంలో విరిగి అభివృద్ధి పనులు చేస్తానని త్వరలో జరగబోయే ఎన్నికల్లో గెలుస్తానని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. మాజీ సిఎం నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి మాజీ మంత్రి రాజ్యలక్ష్మిలా తనయుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వైసిపి అభ్యర్థిగా బరిలో దిగారు. తనను గెలిపించాలని ఆయన ఇప్పటికే పలు సభల్లో ప్రజలను కోరారు. నియోజకవర్గంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పేరుతో ఆయన అన్ని గృహాలకు వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ ఛైర్మన్‌గా వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులుగా నేదురుమల్లి పదవుల్లో ఉన్నారు. ఇరువురు బడా నేతలు కావడంతో పోటీ తీవ్రంగా ఉంటుందని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. 1983 నుండి నియోజకవర్గంలో తమ కుటుంబానికి తనకు సంబంధాలు ఉన్నాయని తాను నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానని రాంకుమార్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. అభివృద్ధిని పరుగులు తీస్తానని చెప్తున్నారు. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగ చేయించానని తెలిపారు. మొత్తం మీద ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో రాజకీయం వేడెక్కింది.

# ముచ్చివోలులో విషాదం

### చెరువులో మునిగి తల్లి కుమార్తెలు మృతి



మృతిచెందిన తల్లి రామలక్ష్మమ్మ(50) , మునిరత్నమ్మ(26) (ఫైల్‌ఫోటో)

శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో ఓ విషాదకర సంఘటన చోటు చేసుకుంది. పశువుల మేపుకోవటానికి వెళ్ళిన తల్లికూతుళ్ల సాయంత్రానికి శవాలుగా మారారు. బాగా ఆస్తిపాస్తులున్న మహిళలు ఇంటి వద్ద పశువులు మేపుకుంటూ కాలం గడుపుతున్నారు. శ్రీకాళహస్తి మండలంలో ముచ్చివోలుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. సోమవారం ఉదయం ఇంటి వద్ద అల్పాహారం తీసుకున్న తల్లి కూతుళ్ళు రోజూ వారి పనిలాగే పశువులను తీసుకొని మెపుకొనుటకు అడవిలో వెళ్ళారు. చెరువు వద్ద అందిన సమాచారం మేరకు భాగిర్తి శంకరయ్య సతీమణి రామలక్ష్మమ్మ(50) ఆమె కుమార్తె బొక్కిసం మునిరత్నమ్మ(26)లు కలసి మధ్యాహ్నం భోజనం మూట కట్టుకొని పశువులతో పాటు బయలు దేరారు. మరి ఏం జరిగిందో ఏమో కానీ సాయంత్రం 4 గంటలకు ఇంటికి రాకపోవటంతో బంధువులు వెతుక్కుంటూ బయలు దేరారు.

**నీటిపై తేలిన శవాలు:**

ఉదయం నుంచి చెరువు సమీపంలో అందిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెరువు కట్ట సమీపంలో వారు భోజనం చేసిన క్యారియర్ గిన్నెలు పడి ఉన్నాయి. దీనిని బట్టి వారు చెరువులో దిగినట్లు చర్చించుకుంటున్నారు. అయితే ఎవరు ముందు పడ్డారు? ఎవరు తరువాత పడ్డారు? ఎలా జరిగింది? అనేది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు భోజనంచేసిన తరువాత ఎవరో ఒకరు ముందుగా బహుశా చేయి కడుక్కోటానికా? లేక గిన్నెలు కడగడానికి దిగారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఒకరి కోసం ఒకరు దిగి ఇద్దరు మృత్యువాత పడినట్లు చర్చించుకుంటున్నారు. రామలక్ష్మమ్మ కుమార్తె మునిరత్నమ్మకు అదే గ్రామానికి చెందిన బొక్కిసం చంద్రశేఖర్‌తో సుమారు 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. కుమారుడు లోకేష్, కుమార్తె చందన ఉన్నారు. ఇద్దరు పట్టణంలోని ఓ ప్రవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ సంఘటన చుట్టుపక్కల గ్రామాల్లో విషాదం చోటు చేసుకుంది. మరి వారు ఎప్పుడు మునిగిపోయారో? ఎలా చనిపోయారో? ఎవ్వరికి అంతుపట్టడం లేదు. ఈ సంఘటనకు సంబంధించి రూరల్ సిఐ అజయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఈ సంఘటనతో గ్రామం విషాదం లో మునిగిపోయారు. తల్లి కూతుళ్ళు మృత్యువులోనూ ఒకటిగా ఉండటం చూపరులు కన్నీటి పర్యంతమయ్యారు.

## మంత్రి కార్యాలయ నిర్వాహకుని హత్యాయత్నం కేసు
# ఛేదించిన తమిళ పోలీసులు



నగరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:
తమిళనాడు తిరుత్తణిలో ఈ నెల 2వ తేదీ ఉదయం మంత్రి రోజా కార్యాలయ కార్యదర్శి ప్రతీష్‌పై జరిగిన హత్యాయత్నం కేసును తిరుత్తణి పోలీసులు ఛేదించారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో కూపీలాగి నగరి మండల మేళపట్టుకు చెందిన నవీన్ అనే వెట్టు నవీన్(31), నగరి మున్సిపాలిటీ కీళపట్టు బీసీ కాలనీకి చెందిన చిరంజీవి(24), నిండ్ర మండలం వైఎన్ కండ్రిగకు చెందిన పరశురాం అనే మధు(39)లను అరెస్టు చేశారు. తిరుత్తణి సర్కిల్ ఇన్స్పెక్టర్ మదియరసన్ తెలిపిన వివరాల మేరకు... టీడీపీ యువత అధ్యక్షుడు చిట్టిబాబు పథక రచన మేరకు మిగిలిన ముగ్గురు పాత్రదారులై హత్యాయత్నానికి ఒడిగట్టారు. నిందితులను కోర్టుకు హాజరు పరచి అక్కడి నుంచి పుఝల్ జైలుకు తరలించారు. కాగా అరెస్టు అయిన వారిలో నవీన్ అనే వెట్టు నవీన్ టీడీపీ యువత ఉపాధ్యక్షునిగా ఉండగా, మిగిలిన ఇరువురు టీడీపీ నాయకులు.

9న కాణిపాకంలో తై అమావాస్య వేడుకలు 4లో

# నాలుగువేల పూజలు
# 117 అభిషేకాలు
### శ్రీకాళహస్తిలో తగ్గని రద్దీ



మృత్యుంజయస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త
ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని దర్శనం కోసం దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. సోమవారం అధికారులు అందించిన సమాచారం మేరకు 25 వేలమంది దర్శనం చేసుకున్నట్లు అలాగే నాలుగువేల మంది రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోగా రికార్డు స్థాయిలో 117 అభిషేకాలు, 43 మహాన్యాసపూర్వక ఏకాదశ పూజలు జరిపించుకున్నట్లు ప్రకటించారు. సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి సోమవారం కర్నాటక, తమిళనాడు భక్తులు విశేష సంఖ్యలో వస్తారు. అధికారులు అందించిన సమాచారం మేరకు రూ. 200ల దర్శన టిక్కెట్లు 652, రూ. 50ల దర్శనం టిక్కెట్లు 1513 అమ్ముడుపోయాయి. ఇక రాహుకేతుదోష నివారణ పూజలకు తండోపతండాలుగా భక్తులు కదలి వచ్చారు. 3385 రాహుకేతుదోష నివారణ పూజలుజరిపించుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. కేశ ఖండన 68 మంది జరిపించుకోగా సుమారు 20వేల ప్రసాదాలను విక్రయించారు.

**శివయ్యకు కానుకల పండగ:**

శివయ్యకు ఎనలేని కానుకల్ని అందిస్తున్నారు. అయితే ఇక్కడ దేవాలయం మీద ఆధారపడి జీవిస్తున్న వారు వచ్చిన భక్తుల్ని నిలువదోపిడికి గురి చేస్తూ భక్తిభావంతో వచ్చిన వారు ఎందుకొచ్చామా? అని నొచ్చు కుంటున్నారు. ఇక ఇక్కడ పూజల్లో వచ్చిన సంభావనలను పంచుకోవటానికి పని చేస్తున్న వారు పడుతున్న గొడవలు పరిశీలకులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఎప్పుడైనా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇలా జరిగిందా? అని ముక్కున వేలేసుకుంటున్నారు. ఏదో ఒక రాజకీయ పార్టీ ముసుగుతో ఇక్కడ చేరుతున్న వారు విచ్చలవిడిగా వ్యవహారిస్తున్నారు. వారిని ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఎవరిని బయటకు పోమ్మంటే ఏమౌతుందో అనే భావం అధికారుల్లో చోటు చేసుకుంది. ఎన్నడూ లేనంత మంది దళారులు ఆలయంలో దర్శనమిస్తున్నారు.




## నిర్వీర్యమవుతున్న విశ్వకర్మ యోజన పథకం

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:



దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోడి చేతివృత్తుల వారి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచడానికి, శిక్షణ కల్పించి తక్కువ వడ్డీతో రుణాలు మంజూరుచేయడానికి ప్రవేశపెట్టిన విశ్వకర్మయోజన పథకం నిర్వీర్యం అవుతోందని జిల్లా కలెక్టరును బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు కలిసి వినతి చేసారు. ఈ పథకంపై రాష్ట్రప్రభుత్వం దృష్టిసారించక పూర్తిగా నిర్వీర్యం చేసారనీ, భారతీయ జనతా పార్టీ తరపున తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు సుధాకర్, సెంట్రల్ మండల అధ్యక్షులు షణ్ముగం, ఓబిసి నాయకులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐరాల తహశీల్దార్‌గా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ఐరాల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:



ఐరాల మండల తహశీల్దార్‌గా టి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఐరాల తహశీల్దార్‌గా పనిచేస్తున్న సుశీల జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కర్నూలు జిల్లా గడివేముల మండలం నుండి బదిలీపై జిల్లాకు వచ్చిన టి.శ్రీనివాసులును ఐరాల తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌ను మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందించారు.

## పాలసముద్రం తహశీల్దార్‌గా సుబ్బలక్ష్మి బాధ్యతల స్వీకరణ

పాలసముద్రం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల తహశీల్దార్‌గా సుబ్బలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న బాబు కర్నూలు జిల్లా నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కదిరి డివిజన్ ఏఓగా పనిచేస్తున్న సుబ్బలక్ష్మి బదిలీపై జిల్లాకు పాలసముద్రం తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌ను మండల రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. ఈకార్యక్రమంలో డీటీ మధుబాబు, సర్వేయర్ కిరణ్, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

## చంద్రబాబు సభను జయప్రదం చేయండి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:

చిత్తూరు పార్లమెంట్ పరిధిలో గంగాధరనెల్లూరు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుచే నిర్వహించే సభను జయప్రదం చేయాలని టీడీపీ నాయకులు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు, జయప్రకాష్, జనార్ధన్ గౌడ్, నాయకులు కమలనాధరెడ్డి, లోకనాధనాయుడు, రమేష్, గిరిబాబు, జయచంద్ర నాయుడు, ధరణి, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు తహసీల్దార్‌గా రంగనాయకులు

పలమనేరు,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:

పలమనేరు తహసీల్దార్‌గా వై.రంగనాయకులు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో సత్యసాయి జిల్లా గోరంట్లలో తహసీల్దార్‌గా బాధ్యతలను చేపట్టిన ఆయన ఎన్ని కల బదిలీ మేరకు పలమనేరు తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించారు.ఇక్కడ తహసీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన కుప్పుస్వామి పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా బదిలీ కావడం జరిగింది. డిటి రుషి వర్మ,ఆర్ఎస్ డిటి సూర్యప్రకాష్,ఆర్ఐ నందిని,సీనియర్ అసిస్టెంట్ హనుమంతు,విఆర్ఓలు పాల్గొన్నారు.

## టమోటా కర్రలు దగ్ధం

పుంగనూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : మండలంలోని బాలగురవయ్యపల్లి వద్ద సోమవారం మధ్యాహ్నం దొరబాబు అనే వ్యక్తికి చెందిన రూ. 60 విలువైన టమోటా కర్రలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఉదయం సదరు సంఘటనా స్థలం వద్ద ధూమపానం సేవించి నిప్పు ఆర్పకుండా వెళ్ళిపోవడంతో మంటలు చెలరేగి టమోటా కర్రలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో కేంద్రాధికారి సుబ్బరాజు అధ్వర్యంలో మంటలను ఆర్పివేశారు.

## కౌండిన్య నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పలమనేరు,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:కౌండిన్య నదిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కలకలం రేపింది. పలమనేరు సమీపంలోని కేటిల్ ఫారం వద్ద కౌండిన్య నదిలో సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓ వ్యక్తి మృతదేహం నీటిలో తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.పలమనేరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మార్పు అవసరం..మద్దతు ఇవ్వండి.. చల్లా బాబు

పుంగనూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :



పుంగనూరులో నాయకత్వం మార్పు అవసరమని, ప్రజలకు నిస్వార్థంగా సేవలందించేందుకు తాను సిద్దంగా ఉన్నానని,తనకు మద్దతుఇవ్వాలని తెలుగుదేశం నాయకుడు చల్లాబాబు విజ్ఞప్తిచేశారు. సోమవారం ఆయన పట్టణంలోని నానాసాహెబ్‌పేట తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయనకు ప్రతివీధిలోనూ పెద్దఎత్తున ప్రజలు స్వాగతం పలుకగా,మహిళలు హారతులు పట్టారు. ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు మార్పుకోరుతున్నారని, ప్రతి ప్రాంతంలోనూ తెలుగుదేశం పార్టీకు మద్దతు లభిస్తున్నదని అన్నారు. ఆయనవెంట తెలుగుదేశం నాయకుడు సామాజిక వేత్త సయ్యద్‌సుహేల్‌బాషా,వెంకటరమణారెడ్డి,పోలీస్‌గిరి,ఆశాది ప్రకాష్, రామయ్య, న్యాయ వాది వెంకటముని, జనసేన నాయకులు చిన్నారాయల్, పగడాల రమణ, విరూపాక్షి, దేశం,జనసేన నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కాణిపాకంలో ప్రమాణానికి ఎమ్మెల్సీ భరత్ సిద్ధమా - తెదేపా నేతలు

శాంతిపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

మఠం పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసిలను తెదేపా నేతలు ప్రలోభాలకు గురి చేశారని ఎమ్మెల్సీ భరత్ మాట్లాడడ ం సరికాదని ఈవిషయంగా కాణిపాకం ఆలయంలో ప్రమాణానికి ఆయన సిద్ధమా అని తెదేపా నేతలు ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైకాపాలో తమకు గుర్తింపు లేదని పంచాయతీ నిధులు సైత ం పక్కదారి పడుతున్నాయని అందుకే తాము టిడిపిలో చేరుతామని వారే స్వయంగా వచ్చారన్నారు. అయితే వైకాపా నేతలు కొందరు సర్పంచ్, ఎంపిటిసి ఇళ్ల వద్ద కాపలా ఉండి వారి కుటుంబీకులను భయభ్రాంతులకు గురిచేసి ఆదివారం ఉదయమే ఇంటికెళ్లిన సర్పంచ్, ఎంపిటిసిలను మరలా కుప్పం తీసుకెళ్లారన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, మణి, ఉయ్యాల జయరాంరెడ్డి, రమేష్, నారాయణరెడ్డి, బాలు, చంద్ర, మంజునాథరెడ్డి, మునేగౌడు, గోపాల్, కేశవులు, ఆంజనేయరెడ్డి, రమేష్, చంద్రకళ, సుగుణమ్మ పాల్గొన్నారు.

## రామకుప్పం తహశీల్దార్‌గా శ్రీధర్

రామకుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

రామకుప్పం తహశీల్దార్‌గా శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంకు చర్యలు తీసుకుంటామని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది తహశీల్దార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిటి దిలీప్ కుమార్, హరినాథరెడ్డి, మహేష్, మహేంద్ర పాల్గొన్నారు.

## చంద్రబాబుకు లక్ష మెజార్టీకై యువత నేతల ప్రమాణం

కుప్పంరూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



మండలంలోని బంతానత్తం ధర్మరాజుల స్వామి ఆలయంలో తెలుగుయువత, వన్నియకులక్షత్రియ యువత ఈసారి తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు లక్ష మెజార్టీ సాధిస్తామని ప్రమాణం చేశారు. ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం సమక్షంలో కంకణం ధరించి విస్తృత ప్రచారం చేస్తామని ప్రచారకార్యక్రమాలను ప్రారంభించా రు. కార్యక్రమంలో నేతలు సాంబశివం, సత్యేంద్రశేఖర్, సతీష్, రవి, శ్రీనివాసులు, చెక్కునత్తం మణి, రామచంద్ర, మురళి, బాలు, గిరి, సురేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## పులిచెర్ల తహశీల్దారుగా వసంతలత

కల్లూరు,ఫిబ్రవరి5ప్రభాతవార్త

పులిచెర్ల మండల తహశీల్దారుగా అనంతపురం నుంచి వసంతలత వచ్చి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనంతపురం డ్వామా కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తు ఇక్కడికి బదిలీపై వచ్చారు. అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని ఈసందర్భంగా ఆమె చెప్పారు.

## వైకాపా బలోపేతానికి కృషి : హరీష్‌రాయల్

చౌడేపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

జిల్లాలో వైకాపా బలోపేతానికి కృషి చేస్తానని హరీష్‌రాయల్ అన్నారు. వైకాపా జిల్లా సేవాదళ్ కార్యదర్శిగా నియమితులైన ఆయన్ను పలువురు కలుసుకొని ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందనీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామ రక్ష అన్నారు. రాబోయే ఎన్నికల్లో యువతను భాగస్వామ్య చేసి వైకాపా ఘన విజయానికి పాటుపడతానన్నారు. సర్పంచు శ్రీరామ్‌భరత్‌వరుణ్, హెచ్‌డిఎస్ ఛైర్మన్ కె.కళ్యాణ్‌భరత్, బోయకొండ ధర్మకర్తల మండలి సభ్యుడు పవన్‌రాయల్, వైకాపా నాయకులు మురళీ, శ్రీనివాసులు, హరి, ధనశేఖర్, నున్నాకుమార్, శివ, గంగాధర్‌లు సన్మానించిన వారిలో వున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



మండలంలోని సిద్ధప్పనూరు తెదేపా నేత సెల్వరాజ్, నడిమూరు పంచాయతీలో గోవిందు అనే బాలుడు మృతి చెందారు. దీంతో కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, దేశం నేతలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అధినేత చంద్రబాబునాయుడు తరపున చెరో పదివేల వంతున ఆయా కుటుంబాలకు అందించారు.సెల్వరాజ్ మృతి పట్ల తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, మాజీ సర్పంచ్ రామచంద్ర, వైస్ సర్పంచ్ దీప పెరుమాళ్, జెకె సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేత

కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి మోడల్ కాలనీలో రెండు రోజులపాటు జరిగిన ఎన్టీఆర్ స్మారక వాలీబాల్ టోర్నీ ముగిసింది. మొత్తం 34 జట్లు పాల్గొన్నాయి. విజేతలుగా నరేష్ వారియర్స్ జట్టు 30వేలు, రన్నర్లుగా కుప్పం లోకేష్ లెజెండ్స్ జట్టు 20వేలు, మూడో బహుమతిగా మోడల్ కాలనీ యూత్ జట్టు 10వేలు గెలుచుకున్నాయి. విజేతలకు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, ఆర్గనైజర్లు గణి, నబీ ఉల్లా బహుమతులు అందించారు. కార్యక్రమంలో నేతలు డా॥ వెంకటేష్, మణి, వేలు, జావిద్, టికె సోమశేఖర్, అల్లాబకష్, బాలు, సతీష్, జనసేన కో ఆర్డినేటర్ డా॥ నరేష్ పాల్గొన్నారు.

## సిఎంను కలసిన ఎమ్మెల్సీ భరత్..రెస్కోఛైర్మన్

కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సోమవారం ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, కుప్పం రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ లాబీలో సిఎంను వారు కలిశారు. ఈసందర్భంగా కుప్పంలో తాజా పరిస్థితులను సిఎం జగన్ ఎమ్మెల్సీ భరత్‌ను అడిగి తెలుసుకున్నారు. రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్ జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం, ఇతర వసతులపై సిఎంకు వివరించారు.

## కుప్పం తహశీల్దారుగా హరికుమార్ బాధ్యతలు

కుప్పంరూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

కుప్పం మండల తహశీల్దారుగా హరికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న పార్వతి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంకు కృషి చేస్తానని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## కుప్పంలో జగనన్నతో జనం..భరతన్నతో మనం కార్యక్రమం

కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి 16వ వార్డులో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అధ్వర్య ంలో ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా పద్మిని జగనన్నతో జనం భరతన్నతో మనం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి మహిళలతో మాట్లాడారు. పసుపు,కుంకుమ, సారె అందించారు. వచ్చే ఎన్నికల్లో తన భర్త ఎమ్మెల్సీ భరత్‌కు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామన్నారు. మీ బిడ్డగా భరత్‌ను గెలిపించి ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు రంగయ్య, సయ్యద్ అలీ, అరవింద్, రాజ్‌కుమార్, సోమశేఖర్, మునిరాజు, మణి, జగన్, ఆంజనేయ గుడి ఛైర్మన్ కుమరేష్, సచివాలయ కన్వీనర్లు రాజా, మంజు, ఇందుశేఖర్, బాబుస్వామి పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేద్దాం

గూడూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తనను గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు పరిమళ వెంకటేశ్వర్లు తెలిపారు. గూడూరు పట్టణంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేపట్టారు. ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు పరిమళ వెంకటేశ్వర్లు తదితరులు కలిసి పట్టణంలోని పాత బస్టాండు, సంగం థియేటర్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు, వ్యాపారులకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో సాల్మన్ రాజు, సతీష్ బాబు, కుడుముల రఘురామయ్య గౌడ్,పాల్గొన్నారు.

## ఎంపిడిఓగా బాధ్యతలు చేపట్టిన అరుణ



బాలాయపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

మండల అభివృద్ధి అధికారినిగా అరుణ సోమావారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా ఆమెను బాలాయపల్లి ఎంపిడిఓగా బదిలీ చేశారు. మండలంలోని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ చేసే వారికే మా మద్దతు

వెంకటగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

త్వరలో జరగబోవు ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన పార్టీకి తాము మద్దతు తెలుపుతామని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ పి. రవి తెలిపారు. 30 సంవత్సరాల నుండి వర్గీకరణ చేస్తామని పలు పార్టీలు వారు మా ఓట్లు వేసుకొని మోసం చేశారని వాపోయారు. వర్గీకరణ చేస్తామని హామీ ఇస్తే ఆ పార్టీని గెలిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మనీ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సంచార జాతుల వారికి భూ పంపిణీ చేయండి

వెంకటగిరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

దక్కిలి మండల మోపూరు క్రాస్ రోడ్డు సెంటర్‌లో ఉన్న ఎరుకుల యానాది నక్కల కులస్తులకు భూ పంపిణీ చేయాలని ఏపీ ప్రజా వేదిక అధ్యక్షులు గడ్డల మునయ్య కోరారు. మోపూరు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 1లో 1287.11 సెంట్లు పశువుల మేత పొరంబోకు భూమి పై గత 40 సంవత్సరాల నుండి వారి తాతల తరాల నుండి హక్కు కల్పించాలని అధికారులను కోరిన పట్టించుకోలేదని తెలిపారు. జిల్లా కలెక్టర్‌కి ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డల మునెయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు శ్రీరామ్ చిరంజీవి, నల్లగొండ వెంకటాద్రి, కిల్లా పెంచలయ్య నగిరిపాటి సుబ్రమణ్యం, శ్రీరామ్ చెంగయ్య, రానా గీత, డబ్బా రాధా, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఏఎంసి ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి పరామర్శించిన రామ్ కుమార్ రెడ్డి

బాలాయపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

మండలంలోని జయంపు గ్రామానికి చెందిన మాజీ ఏఎంసి ఛైర్మన్ వెన్నోటి మధుసూధన్ రెడ్డిని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పరామర్శించారు. మధుసూదన్ రెడ్డి కొంతకాలంగా అనారోగ్యం వల్ల రాజకీయలకు దూరంగా ఉండటంతో ఆయన నివాస గృహానికి వెళ్లి రాంకుమార్ రెడ్డి, యోగక్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకొని క్రియాశీలక రాజకీయాల వైపు దృష్టి పెట్టాలని ఆయన మధుసూధన్ రెడ్డిని కోరారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠిన చర్యలు తీసుకోండి
### - సీపీఎం నేత చాపల వెంకటేశ్వర్లు

ఓజిలి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



ఓజిలి మండలం పెదపరియ నెల్‌క్యాస్ట్ పరిశ్రమ ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మిస్తున్న ప్రహరీగోడను ఆపాలని సీపీఎం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓజిలి మండలం పెదపరియ రెవెన్యూ గ్రామంలో సర్వేనంబర్ 24, 25 పరిధిలో నెల్‌క్యాస్ట్ పరిశ్రమ ప్రభుత్వ భూములు ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మిస్తుంటే రెవెన్యూ అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. లక్షల రూపాయలు విలువ చేసే భూములు కాపాడటంతో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. పేదలకు జానెడు జాగా అడిగితే మాత్రం భూముల్లేవని చెప్పే అధికారులు భూస్వాములు కబ్జాలకు పాల్పడుతుంటే స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత బి.గోపాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ ఆశయాలు చంద్రబాబుతోనే సాధ్యం

చిట్టమూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



ఆంధ్రుల ఆరాధ్యదైవం, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆశయాలు చంద్రబాబుతోనే సాధ్యమని చిట్టమూరు మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు అన్నారు. సోమవారం బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఈశ్వరవాక పంచాయతీలో ఆయన వరుసగా 7వ రోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మారంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, గుండుబోయిన కస్తూరయ్య, అరవపాలెం సర్పంచ్ రాజేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కల్లూరు మణి, అంకబాబు, మురళీధర్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

## దొరవారిసత్రం తహశీల్దార్‌గా బివిఆర్‌సిహెచ్ ప్రసాద్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

దొరవారిసత్రం తహశీల్దార్‌గా బివిఆర్‌సిహెచ్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గుంటూరు జిల్లాలోని మాచవరం తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై దొరవారిసత్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రసాద్‌ను స్థానిక రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం తహశీల్దార్ బివిఆర్‌సిహెచ్ ప్రసాద్ తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న పలు రికార్డులను పరిశీలించి మండల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు డిప్యూటీ తహశీల్దార్ గోపీనాథ్‌రెడ్డి ఉన్నారు.

## స్పందన విజ్ఞప్తులకు శాశ్వత పరిష్కారం చూపండి : ఆర్డీఓ

గూడూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరిష్కరించాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం గూడూరు ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. ..

## ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో 30 మంది ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ సిఆర్ రెడ్డి పేరుమీద డాక్టర్ సిఆర్‌రెడ్డి ఆరోగ్య సంజీవని అనే కార్యక్రమం ద్వారా డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిల సహాయ సహకారాలతో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల జీవన ప్రమాణాలు పెంచడానికి హాస్పిటల్ సూపరింటెండెంట్ షరీద చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సిఆర్‌రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఈ సేవా కార్యక్రమాల రూపంలో ఆయన చిరస్మరణీయులుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కుటుంబ సభ్యులు ప్రభాకర్, వాచ్‌షాప్ రాము, కోట వెంకటేశ్వర్లు, కుమార్‌నాయుడు, పిల్లిల శీను, వెంకటేశ్వర్లు, లక్ష్మణ, సివిఆర్ న్యూస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. .

## రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం
### - కాంగ్రెస్ నాయకులు పరిమళ వెంకటేశ్వర్లు

గూడూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తనను గెలిపించాలని ఆ పార్టీ గూడూరు నియోజకవర్గ నాయకులు పరిమళ వెంకటేశ్వర్లు కోరారు. గూడూరు పట్టణంలో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటికి, దుకాణాలకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సాల్మన్‌రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సతీష్‌బాబు, కుడుముల రాధ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్పందనకు 15అర్జీలు ... తహసిల్దార్

నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త ; నాయుడుపేట రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుండి పలుసమస్యలతో కూడిన 15అర్జీలు వచ్చాయని తహసిల్దార్ రాజేంద్ర తెలిపారు.వాటిలో ముఖ్యంగా ఇంటిస్థలాలు,కాలనిఇళుమంజూరు,భూసమస్యలతో కూడిన వత్రాలు వచ్చాయన్నారు.స్పందనకు వచ్చే అర్జీలను సచివాలయ అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆయన సూచించారు.ఈకార్యక్రమంలో నాయుడుపేట ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి,రెవెన్యూ అధికారులు,సిబ్బంది,ప్రజలు తదితరులు ఉన్నారు.

## సూళ్లూరుపేట రాజకీయ భీష్ముడు బద్దెపూడి
### - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



సూళ్లూరుపేట ప్రాంతంలో రాజకీయ భీష్ముడుగా పేరొంది ఎంతోమందికి రాజకీయ గురువుగా పనిచేసిన దివంగత బద్దెపూడి వేణుగోపాల్‌రెడ్డి చిరస్మరణీయుడని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం బద్దెపూడి వేణుగోపాల్‌రెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా జై గణేశ్ ఉత్సవ కమిటీ వారు నిర్వహించిన వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. వేణుగోపాల్‌రెడ్డి రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదిగి ఎన్నో పదవులను పొందారని సంజీవయ్య చెప్పారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి, ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నేతలు జెట్టి వేణుయాదవ్, మీజూరు రామకృష్ణారెడ్డి, చిన్ని సత్యనారాయణ, మాజీ సర్పంచ్ తన్నీరు శేషగిరిరావు, జై గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు బైరి పార్థసారధిరెడ్డి, సుంకర ప్రతిమ, మల్లికార్జున శర్మ, మల్లి శ్రీనివాసులు, మహేష్, అమల్‌సింహ్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పేదలకు అన్నదానం చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

## సూళ్లూరుపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటా
### - దూర్తాటి మధుసూదన్‌రావు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

సూళ్లూరుపేట కాంగ్రెస్ పార్టీ శాసనసభ అభ్యర్థిగా దూర్తాటి మధుసూదన్‌రావు పోటీ చేసేందుకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఆయన తిరుపతి ఎంపీ స్థానానికి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో సూళ్లూరుపేటలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశానని చెప్పారు. 38 సంవత్సరాలుగా జర్నలిజంలో ఉన్న తనను అప్పటి కాంగ్రెస్ పార్టీ వారు గుర్తించి సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిపారని చెప్పారు. 30 సంవత్సరాలుగా రాజకీయంగా తాను కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానని చెప్పారు. తన అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పకుండా ఆమోదిస్తుందని, ఎన్నికల బరిలో ఉండటం తథ్యమని మధుసూదన్‌రావు చెప్పారు.

## ఆటోడ్రైవర్లకు అవగాహన

గూడూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌టీవో ఆదినారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. సాయం చేసిన వారికి కేంద్రప్రభుత్వం రూ.5 వేలు అందిస్తుందని తెలిపారు. ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. ఎంవిఐ సునీల్, పట్టణ సీఐ పాపారావు, ఆసు పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ షరీనాలు పాల్గొన్నారు.

## ఇన్‌స్పిరాన్ సాంకేతిక సదస్సు-2024 పోస్టర్ ఆవిష్కరణ

కోట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఈ నెల 23న నిర్వహించనున్న ట్రిపుల్-2 విభాగంలో ఇన్‌స్పిరాన్-2024 సాంకేతిక సదస్సు పోస్టర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించి పోస్టర్‌ను విజయకుమార్‌రెడ్డితో పాటు ట్రిపుల్-ఈ విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఎన్.సురేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సదస్సులో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి షీల్డులు, మెమెంటోలు బహూకరిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ఆవిష్కరించేందుకు ఇదొక చక్కటి వేదిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్లు డాక్టర్ పి.రమేష్, వి.పార్థసారథి, విద్యార్థులు పాల్గొన్నారు.


**BEFORE THE HONOURABLE DEBT RECOVERY TRIBUNAL-II**
**1 FLOOR, TRIVENI COMPLEX (PALACE HEIGHTS), ABIDS AT HYDERABAD**
**M.A.No. 21 OF 2020**
**in**
**O.A. No. 218 OF 2019**

Between:
**M/s Sapthagiri Grameena Bank,** by its General Manager, Head office, Chittoor ...**Petitioner/Applicant**
And
**Mrs. Bestha Bhagyamma,** W/o B Ananda, Age: 40 years, Occ: House wife, H.No.24-48-30/2, C/o Manjuatha Kalyana Mandapam, Bye pass road, Punganur-517247 Chittoor District
**Mr. Bestha Kishore** S/o late B Ananda, Age: 20 years, Occ: Student, H.No. 24-48-30/2, C/o Manjuatha Kalyana Mandapam, Bye pass road, Punganur-517247 Chittoor District
**M/s Sri Dwarakamai Rural Godown,** Gurudupally, Palamaner Road, Punganur road, Chittoor District- 517247
**Mrs. Rachamadugu Deepa** W/o Royal Kumar, Age: 39 years, Occ: House wife, Police line, Punganur- 517247 Chittoor District
**Mrs. Rachamadugu Shobha Rani** D/o Gopinath, Age: 43 years, Occ: House wife, D.NO.22-81/1, Bazar Street, Palamaner,-517408, Chittoor District
**... Respondents/Defendants**

**SUBSTITUTE SERVICE BY WAY OF PAPER PUBLICATION**

Whereas the Petitioner/Applicant filed M.A.No.21/2020 for restoration of OA which was dismissed for default. The Honourable Tribunal was pleased to ordered notice by way of publication and posted the **M.A.No.21/2020 to 05.03.2024 at 11.00 a.m.,** for your appearance and counter if any. If you fail to appear the case will be set exparte.

*This notice is issued as per the Honourable Tribunal-II*

**Sd/- B PRABHAKARA RAO**
**Advocate**
Flat No.207, Malik Chambers, Hyderguda Main Road, HYDERABAD
**Mobile: 9989492907**

# క్రెడిట్ సొసైటీ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన ఎస్పి



తిరుపతి క్రైం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : పోలీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మొబైల్ యాప్, వెబ్ సైట్‌లను జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది యొక్క సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ యాప్ జరిగింది. వెబ్ సైట్‌ల ద్వారా 1708 మంది పోలీసులు సేవలను పొందనున్నారన్నారు. కో ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా ఉన్న వారి యొక్క ఫిక్స్ డిపాజిట్, నెలవారి పొదుపు, షేర్ క్యాపిటల్ నగదు ఎంత ఉన్నది అనే వివరాలు, ఫిక్స్డ్ డిపాజిట్ పై ఇచ్చే వడ్డీ వివరాలు షేర్ క్యాపిటల్ పై ఇచ్చే డివిడెంట్ వివరాలు లోన్ అప్లికేషన్ సీనియారిటీ వివరాలు లోన్ మంజూరు అయిన వివరాలు లోను ఈఎంఐ తదితర వివరాలను పిసిసిఎస్ మొబైల్ యాప్, వెబ్ సైట్ ద్వారా సభ్యులు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ మొబైల్ యాప్, వెబ్‌సైట్‌లను అభివృద్ధి చేయడంతో పాటు నిర్వహణను ఆయాన్ టెక్నాలజీస్ తిరుపతి వారు చేస్తున్నారన్నారు. సభ్యులు యాప్ ఉపయోగించే సమయంలో ఏదైనా సహాయం కొరకు సపోర్ట్ అనే ఆప్షన్ ద్వారా టెక్నికల్ టీంను సంప్రదించి మన సమస్యను వారికి తెలియజేస్తే సకాలంలో సదరు సమస్య పరిష్కరింపబడుతుందని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన, కులశేఖర్ శాంతిభద్రత, విమల కుమారి నేర విభాగం, శివరామిరెడ్డి తిరుమల, ఏవో కిషోర్ కుమార్, డిఎస్పీలు సురేంద్రరెడ్డి తిరుపతి, రవీంద్రారెడ్డి ఏఆర్, పోలీస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సెక్రటరీ చెంగయ్య, అసిస్టెంట్ సెక్రటరీ సోమశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు మీనాక్షి, రామశర్మ, సుబ్బయ్య, జయకుమార్, అయ్యప్ప, విద్యాసాగర్, నవీన్ కుమార్, నగేష్, శారద, పోలీస్ సిబ్బంది, అయాన్ టెక్నాలజీస్ తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## చంద్రగిరి తహశీల్దార్‌గా జి.మారుతి



చంద్రగిరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: చంద్రగిరి తహశీల్దార్‌గా జి.మారుతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల బదిలీలలో భాగంగా అనంతపురం జిల్లా, రాయదుర్గం నుండి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ శిరీషాను కడప జిల్లా, పోరుమామిళ్ళకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ను డిప్యూటీ తహశీల్దార్ అమృత, ఏఎస్ఓ స్వర్ణలత, సర్వేయర్ పురుషోత్తం రెడ్డి, కార్యాలయ ఉద్యోగులు, విఆర్ఓలు సాదర ఆహ్వానించారు.

## జిల్లా కలెక్టర్ లక్ష్మీ షాకు విఆర్ఓల సంఘం ఘన సన్మానం



చంద్రగిరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ లక్ష్మీ షాను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలసి విఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ ఆధ్వర్యంలో విఆర్ఓలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓల సంఘం డివిజన్ అధ్యక్షుడు చంగ్రాయులు, జిల్లా కోశాధికారి జి.భాస్కర్, హరికృష్ణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌సిపురం తహశీల్దార్‌గా ఉషారాణి



రామచంద్రాపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ఆర్‌సి పురం తహశీల్దార్‌గా ఉషారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల బదిలీలలో భాగంగా అనంతరపురం జిల్లా గార్లదిన్నె నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లు కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమ్మ, విఆర్ఓలు సతీష్, ప్రసాద్, చిరంజీవి, బాబు, బాబుఖాన్, నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి మోహిత్‌ను గెలిపించండి..!



రామచంద్రాపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: నియోజకవర్గ అభివృద్ధికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎంఎల్ఏగా గెలిపించాలని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి కోరారు. సోమవారం వెంకట్రామాపురం, కెకెవి పురం పంచాయతీలలో గడపగడపకు పల్లెబాట కార్యక్రమ నిర్వహించారు. వైసిపి నాయకులు నలందల సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు, మాజీ సర్పంచ్ జ్యోతి, యశ్వంత్‌రెడ్డి, బీకిరెడ్డి, రాజేష్‌లు పాల్గొన్నారు.

## టీడీపీ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుంది : బొజ్జల సుధీర్‌రెడ్డి



రేణిగుంట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: టీడీపీ ప్రభుత్వం వస్తే బీసీలకు పెద్దపీట వేస్తుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. రేణిగుంట పట్టణంలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాలులో సోమవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు పిలుపు మేరకు జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలో టీడీపీ పార్టీకి చెందిన బీసీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నియోజకవర్గం లోని బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 40 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బీసీ నేత రెడ్డివారి గురువారెడ్డి, టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి బీసీ నేత నరసింహ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు చంద్రరెడ్డి, టీడీపీ మాజీ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి, చర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, బీసీ సీనియర్ నేత డి.పుష్పనాథం, నెల్లూరు సుబ్రహ్మణ్యం, బీసీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం



ఏర్పేడు,ఫిబ్రవరి5 ప్రభాతవార్త; మండలంలోని పల్లంపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తెదేపా నాయకులు, మాజీ మార్కెట్ యార్డు చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జీ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్నటువంటి క్లస్టర్ యూనిట్ బూత్ నాయకులు కార్యాలయంలో సమావేశమై పార్టీ కార్యక్రమాల గురించి చర్చించవచ్చని తెలిపారు. అదేవిదంగా ఇక్కడి రైతులకు దాన్యం నిలవలు చేయడానికి గోడౌన్లు నిర్మిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండల తెదేపా మండల అధ్యక్షులు పొన్నారావు, బిసి రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, ధనంజయులు నాయుడు, శివశంకర్‌రెడ్డి, శివాజిరెడ్డి,నాగేశ్వర్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పాపిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు అండగా ఉన్నాం



ఏర్పేడు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త; ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామంలో సోమవారం ప్రతి గడపలో జగనన్న పథకాల ద్వారా లబ్ది పొందిన లబ్దిదారులతో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే తనయ బియ్యపు పవిత్రరెడ్డి మమేకమవుతూ తాము గెలిచినప్పటి నుంచి అనునిత్యం ప్రజా సేవలో తరిస్తూ కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఈసారి ఎమ్మెల్యేని చేసేందకు మీఅందరి ఆశ్వీర్వాదాలు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్, జడ్పీటిసి తిరుమలయ్య, కోఆప్షన్ మెంబరు బత్తిశెట్టి, సర్పంచి సుధీర్, మస్తాన్, గోపి, ఈశ్వర్, గెరటయ్య, ఎస్ఎస్ చంద్ర, నాగార్జునరెడ్డి, కేశవ ఆచ్చారి, మురగయ్య, వెంకటయ్య, మురగయ్య, వెంకటయ్య, తులసి, బాలకృష్ణ, హరికృష్ణారెడ్డి, ధనంజయరెడ్డి, గుణశేఖర్ నాయుడు తదితర వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు,

## ఏర్పేడు తహసిల్దార్‌గా ఉదయ్ భాస్కర్



ఏర్పేడు, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త; ఏర్పేడు మండల త హసిల్దార్‌గా ఉదయ్ భాస్కర్ రాజు సోమవారం భాధ్యతలు తీసుకున్నారు. ఈసందర్భంగా ఆర్ఐ సంతోష్ యండల కార్యాలయ సిబ్బంది, మండల వైసిపి నాయకులు, మండల ప్రజలు ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్



వరదయ్యపాలెం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొండిలైజ్ సహకారంతో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వరదయ్యపాలెంలో 6,7,8 తరగతులకు కబడ్డి టోర్నమెంట్ విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం, స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, వ్యాయామ దర్శకులు బందిలి కుమార్, రమేష్, మ్యాజిక్ బస్సు ప్రాజెక్టు కోర్డినేటర్ సుమంత్, కోచ్ కిరణ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## తహశీల్దారుగా శంకర్‌రావు బాధ్యతలు



నారాయణవనం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : నారాయణవనం తహశీల్దారుగా శంకర్‌రావు సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా వల్లూరు నుంచి ఎన్నికల్లో బదిలీలో ఇక్కడు వచ్చారు. డిప్యూటీ తహశీల్దారు హరికృష్ నుంచి బాధ్యతలను తీసుకున్నారు.

## పెండింగ్ జీతాలను అందించాలంటూ ధర్నా

నారాయణవనం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : నారాయణవనం మండలంలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు ప్రభుత్వం చెల్లించాల్సిన 24 నెలల జీతాన్ని అందించాలని జిల్లా ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు అంబాకం చిన్నరాజ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతాల్లో ప్రజలకు పారిశుద్ధ్యం ఆరోగ్యం పరిరక్షించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకురావడం జరిగిందన్నారు. ఈ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సుమారు 24నెలల కాలానికి సంబందించి అందించాల్సిన జీతాన్ని అందించకపోతే వారు ఎలా బతకగలరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రీన్ అంబాసిడర్ అన్నాదొరై, మునిచంద్రదాసు, చెంగయ్య, నాయకులు సుభాష్, విజయన్, మునిచంద్ర, ఆనందన్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డ్ టిజి మణి పదవి విరమణ



తిరుపతి టౌన్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : స్విమ్స్‌లో శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న టిజి మణి సోమవారం సాయంత్రం 4 గంటలకు శ్రీ పద్మావతి ఆడిటోరి యం నందు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అయిన టిజి మణి మాట్లాడుతూ స్విమ్స్ నందు 1992 సంవత్సరం నుండి ఇప్పటి వరకు 32 సంవత్సరాలుగా పనిచేస్తు న్నారు. అనంతరం ఆయనను స్విమ్స్ రెగ్యులర్, కార్పొరేషన్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ సెక్యూరిటీ గార్డులు, స్విమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ యుద్ధానికి సిద్ధం...మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



తిరుపతి టౌన్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : రానున్న 2024 ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా న్యాయమైన ధర్మ యుద్ధం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తెలియజేసారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం మీడియా ముందు ఆమె మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వైసిపి పాలనలో ధర్మం పక్కదారి పట్టిందని ఆరోపించారు. తిరిగి రాష్ట్రం బాగుపడాలంటే నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ల పాలనతోనే సాధ్యమవుతుందని టిడిపి, జనసేనల అభ్యర్థులను ఓటర్లు గెలిపించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తిరుపతిలో రాచరిక హుకంతో తండ్రి కొడుకులు రాజ్య మేలుతున్నారని దుయ్యబట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో చైర్మన్ హోదాలో ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారన్నారు. తన భర్త వెంకటరమణ 1982 నుండి ప్రజా జీవితంలో ఉంటూ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ప్రజల మన్ననలు పొందుతున్నారని ఆయన తదనంతరం తిరుపతి ప్రజలు తనను ఆదరిస్తున్నారని గతాన్ని గుర్తు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలుగుదేశం నాయకులు ఆర్సి మునికృష్ణ, పుష్పవతి, బుల్లెట్ రమణ, మునిశేఖర్, ఓట్ల సురేందర్ నాయుడు, దంపురి భాస్కర్, మహేష్, కరాటే చంద్ర, ఆముదాల తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

## విజయపురం తహశీల్దారుగా మల్లిఖార్జునరావు



విజయపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : విజయపురం తహశీల్దారుగా మల్లిఖార్జునరావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కర్నూరలు జిల్లాలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. విజయపురంలో పనిచేస్తున్న తహశీల్దారు వెంకట్రాయలు చిత్తూరు కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. డిప్యూటీ తహశీల్దారులు అశోక్, రూపాలక్ష్మి, సర్వేయర్ శేఖర్, విఆర్ఒలు, నాయకులు గోపినాథ్, చెంచువరప్రసాద్, నారపరాజు తదితరులు పాల్గొన్నారు.

## నగరి తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



నగరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: నగరి తహసీల్దార్‌గా ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకే తహసీల్దార్‌గా ఉన్న జి.చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై నంద్యాలకు వెళ్ళడంతో కడప జిల్లా నుంచి బదిలీపై తహసీల్దార్ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి నగరికి విచ్చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



పుత్తూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక యువకుడు మృతి చెందగా, మరొక యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన పుత్తూరులో సోమవారం సాయంత్రం జరిగింది. పట్టణంలోని గేట్‌పుత్తూరులో శీలకారవీధికి చెందిన గుణశేఖర్ కుమారుడు శరవణన్ (28) మండలంలోని తిరుమలకుప్పం గ్రామానికి చెందిన బత్తెయ్య కుమారుడు నరేష్‌తో (27) కలిసి పుత్తూరు నుంచి ద్విచక్ర వాహనంలో నగరికి వెళుతున్నారు. నందిమంగళం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో శరవణన్ అక్కడికక్కడే మృతి చెందాడు, తీవ్రంగా గాయపడిన నరేష్‌ను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుపతిరూరల్ తహశీల్దార్‌గా మెహబూబ్



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ తహశీల్థార్‌గా మెహబూబ్ చాంద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహశీల్థార్‌గా పని చేస్తున్న టి.వి.సుబ్రమణ్యం అనంతపురం జిల్లాకు బదిలీ అయిన విషయం తెల్సిందే. తిరుపతిరూరల్ తహశీల్థార్‌గా బాధ్యతలు చెపట్టిన మెహబూబ్ చాంద్‌కు ఉప తహశీల్థార్ రేఖారెడ్డితో పాటు అదనపు తహశీల్థార్స్ ఈశ్వర్‌రెడ్డి, గంగయ్య, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఉమాకాంత్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అవయవ దానం ప్రాముఖ్యతపై అవగాహన



తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో అవయవ దానం యొక్క ప్రాధాన్యతను డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని విసి భారతి, రిజిస్ట్రార్ రజిని ప్రోత్సాహంతో విద్యాపతి ఎన్ఎస్ఎస్ బ్యూరో కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తవిత తులసి, డాక్టర్ కె.స్వాతి, డాక్టర్ కె.సుజాత, డాక్టర్ అనిత, డాక్టర్ శిరీష, డాక్టర్ సునీత, డాక్టర్ మల్లేశ్వ రమ్య, విద్యార్డులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

## క్యాన్సర్ పై అవగాహన



తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ కె. హైమావతి ఫిబ్రవరి 4వ తేది ప్రపంచ కాన్సర్ దినోత్సవాన్ని క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని మహిళా ప్రాంగణంలో శిక్షణ పొందుతున్న మహిళలకు సోమవారం నిర్వహించారు. డాక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం అనేది క్యాన్సర్ అవగాహన కోసం ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాన్ని 2000వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేది స్మారకిస్తూ క్యాన్సర్ గుర్తింపు కారణాలు, చికిత్స, నివారణ, ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించబడుతుందని తెలిపారు. మహిళా ప్రాంగణ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పర్జానా ఇతర సిబ్బంది, మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది, డాక్టర్ ఎం. ఇంద్రాణి, డాక్టర్ ఎం. సుచరిత, మహిళలు పాల్గొన్నారు.

## సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా ప్రచారం



తొట్టంబేడు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సూచనలతో శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధి లోని తొట్టంబేడు మండలంలో పలు గ్రామాల్లో విస్తృతంగా రాష్ట్ర బిజెపి కార్యదర్శి నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్ కుమార్ సోమవారం ఈశాన్య ప్రాంతమైన చిన్నసింగమాల గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించుకుని ప్రచారాన్ని ప్రారంభించారు. తొలుత పొయ్యకొత్తూరు గ్రామం, సింగమాల గ్రామాల్లో పర్యటించి కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి కేంద్రంలో మరొక్కసారి నరేంద్రమోడీ సర్కారు, ఆంధ్రలో ఒక్కసారి కోసం ప్రతి ఒక్కరు భారతీయ జనతాపార్టీ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల అధ్యక్షుడు వేదాం కృష్ణయ్యతో పాటు జిల్లా మరియు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల సర్వేయర్‌గా దేవానంద్

తొట్టంబేడు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : తొట్టంబేడు మండల సర్వేయర్‌గా తిరుపతిలోని డిఎస్ఎల్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న బి.దేవానంద్‌ను మండల సర్వేయర్‌గా నియమించారు. కొత్తగా వచ్చిన మండల సర్వేయర్‌తో సచివాలయ సర్వేయర్లపై భారం తగ్గడంతో పాటు రీసర్వేను వేగవంతం చేయడంకు సులభతరంగా మారుతుంది.

## శివయ్య సన్నిధిలో విజయవాడ దుర్గమ్మ ఆలయ చైర్మన్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు కర్నాటి రాంబాబు విచ్చేశారు. ఆయనకు ఏఈఓ సతీష్ మాలిక్, పిఆర్ఓ నాగభూషణంనాయక్‌లు సంయు క్తంగా స్వాగతం పలికి స్వామిఅమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేసుకున్నారు.

## శ్రీకాళహస్తి తహశీల్దార్‌గా జనార్దన్‌రాజు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయానికి జనార్దన్‌రాజును నియమించారు. ఈమేరకు ఆయన సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసందర్భంగా నూతన తహశీల్దార్‌ను డిప్యూటీ తహశీల్దార్ రూప్‌చంద్, అధికారులు మునిరాజమ్మ, సిఎస్‌డిటి నల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ కుప్పయ్య,ఆర్ఐలు దివాకర్, భాస్కర్‌లు దుశ్శాలువతో సత్కరించారు.

## శ్రీకాళహస్తి ఎంపిడిఓకు సన్మానం



శ్రీకాళహస్తి రూరల్,ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఎంపిడిఓకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సత్కరించారు. శ్రీకాళహస్తి మండల పరిషత్ అధికారిగా రఫీఖాన్ సమర్థవంతంగా పని చేస్తూ ప్రజల ప్రశంసలందుకుంటున్నారు. ఆయనను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి చెందిన మాజీ మార్కెటింగ్ కమిటి అధ్యక్షుడు, ప్రస్తుతం వైకాపా మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, బియ్యపు గోవిందరెడ్డి, మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లు, మదనమోహన్‌రెడ్డి,పునబాక వెంకటేశ్వరరావు, అంకయ్య, మురళి,పసల కృష్ణయ్య, హరినాధ్‌రెడ్డిలు సత్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న రఫీఖాన్ సేవలను కొనియాడారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించండి



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల సహకారంతో ప్రతి రోజూ ఏడు వేల మందికి నిత్యాన్న ప్రసాదంలో భోజన వసతి కల్పిస్తున్నారని ఈ పథకంలో నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన నిత్యాన్న ప్రసాదాన్ని రుచి చూసారు. ఆయన భక్తులతో కలసి భోజనం చేసారు.

## జనసేన నాయకులకు ఘనస్వాగతం



తొట్టంబేడు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : జనసేన విజయయాత్రలో భాగంగా 'ఏపి నీడ్స్ పవన్ కళ్యాణ్' 54వ రోజు మండలంలోని రౌతుసూరమాల పంచాయతీలో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. జనసేన నాయకురాలు వినుత కోట. కోట. చంద్రబాబులకు పూలవర్షంతో మంగళహారతులతో స్వాగతం పలికారు. పంచాయతీలో ప్రచారం నిర్వహించి ఉమ్మడి మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి పేట చంద్రశేఖర్, జనసైనికులు హరికృష్ణ, లక్ష్మినారాయణ, రాకేష్, తేజ, శివ, నాయకులు దండిరాఘవయ్య, తోట గణేష్, కావలిశివకుమార్, పార్టీ జనసైనికులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ఒక్కటే వైకాపా లక్ష్యం : బియ్యపు శ్రీవాణి



తొట్టంబేడు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : అటు రాష్ట్రంలోను, ఇటు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోను సంక్షేమం, అభివృద్ధి ఒక్కటే వైకాపా లక్ష్యం అని ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి సతీమణి బియ్యపుశ్రీవాణి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని ఇలగనూరు పంచాయతీలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆమెకు మండల ఎంపిపి ఉన్నంనిర్మల, మండల సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా బియ్యపుశ్రీవాణి ప్రతి ఇంటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీచేసారు. సంక్షేమ పాలన కొనసాగడం కోసం ఒకటి అసెంబ్లీకి, ఒకటి పార్లమెంటుకు ఫ్యాను గుర్తుపై రెండు బటన్‌లు నొక్కి రాష్ట్రంలో వైకాపాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ పోతుగుంట మణిబాబు నాయుడు, సర్పంచ్ సుబ్రమణ్యం నాయుడు, జెసిఎస్ కన్వీనర్ సుబ్రమణ్యంయాదవ్, భక్తవత్సలం, బత్తెయ్య, రాజగోపాల్, పెంచలయ్య, సుబ్బరామయ్య, బాబు, మునిరత్నం, గరటారెడ్డి, కన్వీనర్ రవీంద్రారెడ్డి,శ్రీరాములురెడ్డి, కోవిచంద్రయ్యనాయుడు, కొన్నలిరమేష్‌బాబు, సుబ్బరామయ్య, పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

### తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



చంద్రగిరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాలనలో ప్రజల సౌకర్యార్థం చేపట్టిన రూ.50 కోట్లతో పనులను పూర్తి చేసి సోమవారం ప్రారంభోత్సవాలు చేసినట్లు తుడా చైర్మన్, ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. మండల పరిధి లోని పనపాకం, కల్‌రోడ్‌పల్లి, ఎం.కొంగరవారి పల్లి పంచాయతీలలో సోమవారం పండుగ వాతావరణంలో ఆయన ప్రారంభోత్స వాలను చేశారు. అదేవిధంగా రామిరెడ్డిపల్లి, నరశింగాపురం, మిట్టపాళ్యం, శానంబట్ల, పనపాకం, కల్‌రోడ్‌పల్లి, ఎం.కొంగరవారిపల్లి పంచాయతీలలో "ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే" కార్యక్రమం నిర్వహించారు. మిట్టపాళ్యంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల సమరానికి తాము "సిద్ధం" అంటూ మోహిత్ రెడ్డిచే శంఖాన్ని పూరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపిడిఓగా డాక్టర్ వి.వి.సూర్య సాయి



చంద్రగిరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ఎంపిడిఓగా డాక్టర్ వి.వి.సూర్య సాయి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా, చిల్లకూరు మండలం నుండి చంద్రగిరికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఓ నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు బదిలీపై వెళ్ళారు. ఎంపిడిఓ ఈఓపిఆర్‌డి శశిరేఖ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవిచంద్ర, కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సాదరంగా ఆహ్వానించారు.

**CHANGE OF NAME**

I. (OLD NAME) **DONADHI RAVEENDRA** S/O. DONADHI LINGAM NAIDUCHANGE MY NAME AS (NEW NAME) **DONADI RAVEENDRA** S/O DONADI LINGAM NAIDU. RES NO 23-3-39/RA/102 RAMAKRISHNA NAGAR, VAIKUNTAPURAM, TIRUPATI DT, A.P. MY PASSPORT NO.B7576628.

**CHANGE OF NAME**

I. (OLD NAME) **DONADHI ARUNA KUMARI** W/O. DONADHI-RAVEENDRA CHANGE MY NAME AS (NEW NAME) **DONADIARUNA KUMARI** W/O DONADI RAVEENDRA. RES NO 23-3-39/RA/102 RAMAKRISHNA NAGAR, VAIKUNTAPURAM, TIRUPATI DT, A.P. MY PASSPORT NO.B7576629.

